# మీలో పాపం చేయని వారు ఎవరో చెప్పండి!



శ్రీకాకుళం
**వసుంధర**

మొట్టమొదట పరమశివాన్ని చూసినప్పుడు మేమెవ్వరమూ ఆయనో గొప్పవాడనీ, ఆయన గొప్పతనం తెలుగుదేశమంతటా గుర్తింపబడుతుందనీ అనుకోలేదు. చూడ్డానికి చాలా సామాన్యంగా ఉన్నాడాయన. వయసు ముప్పైకీ నలభైకీ మధ్య ఉంటుంది. ముఖం అందమైనది. కళ్ళలో ఏదో ప్రత్యేకమైన ఆకర్షణ ఉంది. మనిషి మంచి పొడగరి.

మాది రెండు వాటాల ఇల్లు. రెండూ ఒకదానితో ఒకటి సంబంధం లేకుండానే ఉంటాయి.

మేమొక వాటాలో వుండి రెండోది ఎవరికయినా అద్దెకిస్తూంటాం. నాలుగేళ్ళుగా అందులో ఉంటున్న ఒకాయన నాలుగురోజుల క్రితమే ఖాళీచేసి వెళ్ళిపోయాడు. ఆయన అద్దె సరిగ్గా ఇచ్చేవాడు కాదు. వాళ్ళింట్లో వారంతా తగవులమారి మనుషులు. గోడలనిండా మేకులు కొట్టి రాతలురాసి ఇల్లంతా పాడు చేస్తున్నారనీ మా ఆడవాళ్ళుగోల పెట్టినా లెక్కచేసేవారు కాదు.

పరమశివం మా ఇంట్లో అద్దె కుండడానికి వచ్చాడు. ఆయనకు వివాహం కాలేదు. నాలుగు నెలల అద్దె అడ్వాన్సుగా ఇస్తానన్నాడు. ఇంతకు ముందాయన యిచ్చేదాని మీద పదిరూపాయలు ఎక్కువ ఇస్తానన్నాడు. అగ్రిమెంటు మేమెలాకోరితే అలా రాసిస్తానన్నాడు. మాకెప్పుడు అసంతృప్తిగా ఉంటే అప్పుడు ఇల్లు ఖాళీచేసి వెళ్ళిపోతానన్నాడు. బ్రహ్మచారులకు ఇల్లివ్వడం అట్టే ఇష్టంలేదు. కానీ పరమశివానికి ఇల్లివ్వడం జరిగింది. ఇంట్లో ప్రవేశిస్తూనే వీధిగుమ్మంలో ఓ బోర్డు తగిలించాడు పరమశివం.

"హనుమాన్ వైద్యం, డాక్టర్లు ఆశలు వదిలేసిన అన్ని రకాల జబ్బులకూ హనుమంతుడి ఆశీర్వచనంతోనూ అద్భుతమైన మూలికలతోనూ గ్యారంటీ నివృత్తి" అని వ్రాసి ఉంది దానిపైన. అది చూసి మా ఇంట్లో నవ్వుకున్నాం.

నాకు చాలాకాలంగా అజీర్తి వ్యాధి. గట్టిగా ఏం తిన్నా కడుపు నొప్పి వస్తుంది.

మా ఇంట్లోనే ఉంటున్నాడు కదాఅని నా బాధ పరమశివానికి చెప్పుకున్నాను. వెంటనే ఆయన నన్ను జాతకం తీసుకురమ్మన్నాడు. జాతకం పట్టుకెళ్ళి ఇచ్చాను. అది ఆయన పరీక్షించాడు. తర్వాత నా చేయి చూశాడు. రోగలక్షణాలన్నీ అడిగి, విని, "నువ్వు ముందుగా ఒకరోజంతా నేను చెప్పిన పద్ధతిలో ఆంజనేయస్వామి పూజ చేయాలి" అన్నాడు.

నాకాశ్చర్యంవేసి 'జబ్బుకీ పూజకూ సంబంధమేమిటీ' అనుకున్నాను.

నేనాయన చెప్పిన విధంగానే ఒకరోజు ఆంజనేయుడికి పూజ చేసాను. నా తరపున ఆయన కూడా తనింట్లో ఆంజనేయుడి పూజచేసి ఫీజు పదిరూపాయలు తీసుకున్నాడు. ఆతర్వాత మందులకి పదిరూపాయలు తీసుకున్నాడు. వారం రోజుల్లో అన్నేళ్ళ నా అజీర్తివ్యాధీ చేత్తో తీసినట్లుగా మాయమైపోయింది. ఈ విషయం

మా ఆఫీసు కోలీగ్స్‌కు చెప్పాను.

"మీ ఇంట్లోనే ఉద్దెసుంటున్నా డుగా ఏజన్సీ తీసుకుంటున్నావా?" అని కొందరు నన్ను వేళాకోళం చేశారు. నేనింకేమీ అనలేదుగానీ హనుమాన్ వైద్యం క్రమంగా పేరు తెచ్చుకుంటోంది. అన్ని ఆశలూ వదిలేసుకున్న ఓ ఎమ్మెల్యే బావమరది కొడుకును పరమశివం బ్రతికించడంతో ఆయనకు పత్రికా ముఖంగా కూడా ప్రచారం లభించింది. ఏడాది తిరక్కుండానే హనుమాన్ వైద్యంకోసం జనం తీర్థ ప్రజల్లా రాసాగారు.

ఇది ఊళ్ళోని డాక్టర్లలో కొంత సంచలనం కలిగించింది. అంతా కలిసి ఏకమై ఒక తీర్మానంచేశారు. దాని సారాంశమిది. "వైద్యాన్ని దేవుడిపేరులో ముడిపెట్టడం అన్యాయం. చదువు సంధ్యలు లేని సామాన్యులు మోసపోయి ఆ మందులు తీసుకుని నిష్కారణంగా శరీరారోగ్యాన్ని పాడుచేసుకుంటారు. ప్రభుత్వం యిటువంటి వాటిని నిషేధించాలి"

ఈ తీర్మానం ప్రభావం ఊరికే పోలేదు. పరమశివానికి డాక్టర్ల ఆరోపణను తెలియజేస్తూ ప్రభుత్వం నుంచి నోటీసు అందింది పరమశివం నోటీసుకు బదులిచ్చాడు. తను ఏ పరీక్షకైనా సిద్ధంగా ఉన్నానని.

నిపుణుల సమక్షంలో పరమశివం వైద్యవిజ్ఞానం పరీక్షించడం జరిగింది. ఆ పరీక్షలో తేలినదేమిటంటే అతడు మానవ శరీర శాస్త్రంలో నిష్ణాతుడు. ప్రస్తుతం మార్కెట్లోవస్తున్న ఇంగ్లీషు మందులు, వాటి ప్రయోజనం అతడికి తెలుసు. ఇంకా చెప్పాలంటే అతను ప్రపంచంలో వైద్యపరంగా జరుగుతున్న పరిశోధనల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాడు. అతడి విజ్ఞానం అతణ్ణి పరీక్షించిన వారికంటే మించిఉంది.

ఈ వార్త బయటకు రాగానే పరమశివం పలుకుబడి యింకా పెరిగిపోయింది. పొరుగూళ్ళనుంచి కూడా జనం రావడం మొదలైంది.

నెలకు రెండు మూడుసార్లైనా ఏదో ఒక పత్రికలో అతడి ఫోటో ఉండేది.

అతని వైద్యం కారణంగా అతడితో రహస్యంగా, చనువుగా మాట్లాడే అవకాశం చాలా మంది ఆడవాళ్ళకున్నది. తనకు లభించే అవకాశం పరమశివం ఎలాఉపయోగించుకునేవాడో తెలియదు-ప్రభావతి కేసు బయటకు వచ్చేవరకూ.

ప్రభావతి బాల వితంతువు పెళ్ళంటే తెలియని వయసులో

పెళ్ళి జరిగింది. భర్తంటే తెలిసే వయసుకు భర్త లేడు. ఆమె భర్త పోయిన కారణంగా బియ్యే దాకా చదువుకుంది. ఓ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. పరమశివం పేరు ప్రఖ్యాతులు విన్న తర్వాత ఆమెకు తల తిరుగుడు రోగం పట్టుకుంది. తన జబ్బు గురించి ఏకాంతంలో ఆమె పరమశివానికి చెప్పుకుంది. పరమశివం ఆమెనూ, ఆమె తల్లినీ తన యింట్లో వారం రోజులుంచుకున్నాడు. ఆ తర్వాత వారానికి రెండేసి రోజులు ఆమె రాత్రి సమయంలో వెళ్ళి మందు పుచ్చుకునేది. అలా నాలుగు నెలలు గడిచేక ఒక రోజున ప్రభావతి తనింట్లో దూలానికి ఉరి పోసుకుని చనిపోయింది. చనిపోతూ ఆమె ఒక చీటీ రాసి పెట్టింది. అందులోని సారాంశమిది. "నేను నిన్ను ప్రేమించాను. నిన్ను నా ప్రేమతో కట్టిపడేయాలనుకున్నాను. కానీ నీ దృష్టి అంతా హనుమాన్ వైద్యం మీదనే ఉంది. ప్రజాసేవ—అందువల్ల లభించే కీర్తి ప్రతిష్టలు అవి తప్ప ఇంకేమీ అక్కర్లేదు నీకు! అందుగురించి ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోవాలని తీర్మానించుకున్నావు. నీకు ఆడదాని శరీరం కావాలి కానీ, ఆ కోరిక ఎట్టి బాధ్యతనూ మిగల్చరాదు. కాని ఆడదాని కదెలా సాధ్య పడుతుంది? మన పరిచయం పండింది. ఆ పంటను పదిమందికీ ధైర్యంగా చూపించుకునే మనోబలం నాకు లేదు. నువ్వు నా మెడలో తాళికడితే అది వేరే సంగతి! నీ కిష్టంలేని ఈ బాధ్యతను భూమ్మీదకు ఎలా తీసుకురాను? బ్రతికితే నీకు భార్యగా, నీ బిడ్డకు తల్లిగా బ్రతకాలని ఉంది. లేకపోతే బ్రతకాలని లేదు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నాను. ఇందులో నాదురదృష్టాన్ని నేను నిందించుకోనడం తప్ప నిన్ను తప్పుబట్టలేను. నేను చచ్చిపోతున్నా నీమీద నా ప్రేమ చావడం లేదు. ఈ ఉత్తరం ఆ ప్రేమతోనే రాస్తున్నాను."

ఉత్తరం పరమశివాన్ని ఉద్దేశించి వ్రాయబడింది. చనిపోయినప్పటికి ఆమె మూడు నెలల గర్భవతి అని పరీక్షలో తేలింది.

ప్రభావతి ఆత్మహత్య రాష్ట్రంలోనే పెద్ద దుమారం లేపింది. మొట్టమొదట జన సమూహం ఉవ్వెత్తున పరమశివం యింటి మీదకు వచ్చారు. పరమశివం ఎవరికీ తెలియకుండా ఇంట్లోంచి తప్పించుకుని పారిపోయాడు. ఆ క్షణంలో అంతకు మించి గత్యం

తరం లేదు. ఊళ్ళోవి వేడి చల్లారిన నాలుగు రోజులకి పరమ శివం మళ్ళీ తిరిగి వచ్చాడు.

"ఎందుకొచ్చావు? నిన్ను జనం చంపేస్తారు" అన్నారు నాన్నగారు.

"తప్పదండి. నేను కొందరికి వైద్యం సగంలో ఆపేశాను. అది పూర్తి చేయడం నా ధర్మం" అన్నాడు పరమశివం.

"ఇన్ని ధర్మాలు తెలిపినవాడివి ఆ పిల్లకెలా అన్యాయం చేశావు?" అన్నారు నాన్నగారు.

"హనుమాన్ వైద్యం ప్రభావం చూశారుగదా - ఇది సంసారం చేసుకుంటూ కాలక్షేపంగా చేసే వైద్యంకాదు. నాకంటూ ఎలాంటి బంధాలూ పెట్టుకోదల్చలేదు. నేను నేనుగానే ఉండి ఈ వైద్యాన్ని ప్రపంచ ప్రజల కుపయోగించేలా చేద్దామని" అన్నాడు పరమశివం.

"మరలాంటప్పుడు తప్పటడుగు ఎందుకువేశావ్?"

"ఆమె నన్ను ప్రేమించానంది. ప్రేమంటే నన్ను చూశాకనే తొలిసారిగా తెలిసిందంది. నేను తనకు బాధ్యతగా మారనని హామీఇచ్చింది. నేను వివాహమైతే చేసుకోను గానీ ఆడదాన్ని తాకకుండా ఉండలేను. నాకింకా ఇతరత్రా ఆడవాళ్ళతో సంబంధముంది. కానీ ప్రభావతి అందరిలాంటిదికాదు. ఆమె నన్ను భర్తగా అభిమానించింది. నాకు భార్యగా బ్రతకాలనుకుంది. నా నిర్ణయం తర్వాత తర్వాత మారదా అని ఆశపడింది. నా నిర్ణయం ఎంత ఖచ్చితమైనదో ఆమెకు తెలియదు. ఆమె మనసు ఎంత సున్నితమైనదో నాకు తెలియదు. ఆమె చనిపోయినందుకు నేనూ ఎంతగానో విచారిస్తున్నాను" అన్నాడు పరమశివం.

పరమశివం ఆమెను మోసం చేశాడో లేదో తెలియదు కానీ ఆయనకున్న పలుకుబడి కారణంగా ప్రభావతి ఆత్మహత్య ఓ పెద్దవార్త అయికూర్చుంది. ఎక్కడెక్కడి వారూ ప్రభావతి ఆత్మశాంతిని కోరుతూ సంతాపసభలు నిర్వహించ సాగారు. ప్రభావతిపై కవులు, రచయితలు గేయాలు, కథలు రాశారు.

వార్తా సంచలనం సంగతి అలా గుంటే ఇది అవకాశంగా తీసుకుని ఊళ్ళోని డాక్టర్లు పరమశివం వైద్యం కొనసాగించడానికి వీల్లేదని తీర్మానించారు.

పరమశివం వద్దకు ఏ రోగి వచ్చినా హనుమంతుడి పూజ చేయాలి. ఇతడి నియమం అసహాయులైన కొందరు మతస్థులకు ఇబ్బందిగా పరిణమించింది. ప్రజ

లలో మతభేదం సృష్టించేందుకు సహాయపడుతోంది. అంతేకాదు-- విజ్ఞానంతో కళ్ళు తెరిచి అన్నీ అర్థంచేసుకోవలసిన ఈ రోజుల్లో దైవపూజకూ, వైద్యానికీ ముడి పెట్టడం మూఢ నమ్మకాలను ప్రచారం చేసినట్లన్పించుకుంటుంది. సమాజానికి పరమశివం పేరు చెప్పి రకరకాలుగా అన్యాయం జరిగింది.

ఇలాంటి ఎన్నో ఆరోపణలు వేసి ఒక డాక్టర్ పరమశివంపై కోర్టులో కేసుపెట్టాడు. అన్నింటి లోకీ ముఖ్యమైన ఆరోపణ ప్రభావతి ఆత్మహత్య.

పరమశివానికి కోర్టునుంచి పిలుపు వచ్చింది. ఆయన తన కంటూ వేరేలాయర్ని నియమించు కోలేదు. అన్నింటికీ తనే సమాధానాలు చెప్పుకుంటానన్నాడాయన. తనమీద వచ్చిన ప్రతి ఆరోపణకూ ఈవిధంగా చెప్పుకున్నాడు.

"అందరికీ సవినయంగా మనవి చేసుకుంటున్నాను. అసూయాపరుల ఆరోపణలతో నాలోని మంచి చెడ్డలను నిర్ణయించకండి. నన్ను నన్నుగా చూడండి.

ముందుగా ప్రభావతి ఆత్మహత్య గురించి ఆమె చచ్చిపోతుందని నేననుకోలేదు. ఆమె నామీద ప్రేమతో చచ్చిపోయింది. అందుకు నేనేం చేయను? ఆమెకులాంటి సున్నితమైన మనస్తత్వమే నాకూ ఉంటే ఈరోజిలా కోర్టుకు పిలుపు వచ్చినందుకు ఆత్మహత్య చేసుకొని ఉండేవాణ్ని. అప్పుడు నా మీద అన్యాయంగా కేసు బనాయించినవాణ్ని హంతకుడంటారా? అదలాగుంచండి.

ప్రభావతికింతటి సున్నిత మనస్తత్వం ఎలా ఏర్పడింది? పాశ్చాత్యదేశాల్లో యువతీ యువకులు పెళ్ళికాకుండానే కలిసి ఉంటారు. భర్తలేకుండా ఆడది, భార్యలేకుండా మగాడు పిల్లల్ని కలిగిఉండడం అక్కడ చట్టసమ్మతం. అదే సమాజం ఇక్కడా ఉండి ఉంటే ప్రభావతి నాదాకా వచ్చేదే కాదు. వచ్చినా ఆత్మహత్య చేసుకొనేదీకాదు. తననూ తన బిడ్డనూ ఈ సమాజంలోని ప్రతి వ్యక్తీ కుక్కల్లా వేటాడతారని భయపడి ఆమె ప్రాణాలు తీసుకుంది. ఇంతమంది హంతకుల మధ్య బ్రతకలేక ఆమె చచ్చిపోయింది. ఆ హంతకులంతా కల్సి నన్ను హంతకుడంటే నవ్వాలో ఏడవాలో తెలియడంలేదు.

ఇంక నేను మూఢనమ్మకాలను ప్రోత్సహించడం గురించి: ప్రభుత్వం ప్రత్యేకంగా రైళ్ళను

నడుస్తోంది తిరుపతికి ఎందుకు? కోట్లాది ప్రజల మూఢ నమ్మకానికి వంత పాడేందుకు! తిరుపతి కొండ మీద యాత్రికులకు ఎన్ని సదుపాయాలు జరుగుతున్నాయి? ఏటా ఎన్నికోట్ల ధనం సామాన్య ప్రజల నుంచి భగవంతుడికి చేరుతోంది? అదంతా అలాగుంచి నా హనుమాన్ వైద్యం మూఢనమ్మకాలను బలపరుస్తోందనడం బాగుందా? ఇంక మత కలహాల ప్రసక్తి లేనేలేదు. హనుమంతుడి పూజ యిష్టంలేని వారు నాచేత వైద్యం చేయించుకోరు. నేను బలవంతంగా ఎవరి పైనా నా వైద్యాన్ని రుద్దడంలేదు. హనుమంతుడి పూజ నా వైద్యంలో ఒక భాగం. నేను ఇతర మతస్థుల దైవాలను నిందించడంగానీ చులకన పరచడంగానీ చేస్తే అదినా తప్పు అవుతుంది. నేనలా చేయలేను!

ఇంత దేశంలోని యువతరమంతా నా నైతిక ప్రవర్తనను గర్హిస్తోందంటున్నారు. అలా గర్హించే అర్హత వారికున్నదా అన్నది నా అనుమానం!

నా వృత్తి, ప్రవృత్తి కారణంగా నాబలహీనతలను ప్రోత్సాహపరిచే సంఘటనలు జరిగాయి. నలుగురూ "తప్పు" అనే పని నేను చేశాను. ఆ విషయమై నన్ను గర్హించే యువతరాన్ని ఎలుగెత్తి ఇలా అడగాలని ఉంది నాకు.

మీరు అభిమాన సంఘాలు స్థాపించి దర్శన భాగ్యానికై గంగవెర్రిలెత్తిపోతూండే సినీతారల నైతిక ప్రవర్తన ఎలాంటిది? మీరు సభల్లో పూలదండలు వేసి సత్కరించే మీ రాజకీయనాయకుల నైతిక ప్రవర్తన ఎలాంటిది? అనుక్షణం మీతో కలిసి తిరుగుతూండే రైల్వే టికెట్ కలెక్టర్లూ, తాలూకాఫీసు ఉద్యోగులూ, వ్యాపారస్థులూ వగైరాల నైతిక ప్రవర్తన ఎలాంటిది? నా కారణంగా ఒక ప్రభావతి ఆత్మహత్య చేసుకుంది. కానీ వారి కారణంగా కోట్లాది ప్రజలు బాధపడుతున్నారు.

వారిని గర్హించాలనైనా మీకు అన్పించిందా? అదలాగుంచితే- యువతరాన్ని సూటిగా అడగాల్సిన ప్రశ్న ఇంకా ఒక్కటుంది. రమారమి ముప్పైయేళ్ళు వచ్చిన ప్రభావతికింకా వివాహం కాలేదు- బాలవితంతువు అన్న కారణంగా!

ప్రభావతికంటె అందంగా ఉండి పాతికేళ్ళు దాటని ఎందరో ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు కావడంలేదు- కట్నాల బెడదవల్ల. పెళ్ళిళ్ళుకాక ఆడపిల్లలూ, పెళ్ళిళ్ళు చేయలేక ఆడపిల్లలనుకన్న తలిదండ్రులూ,

పెళ్ళయ్యాక కట్నం తేలేదని అత్త వారు పెట్టెబాధలు పడలేక ఎందరో ఆడపడుచులూ- ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు రోజూ వార్తల్లో చూస్తున్నాను. ఇవన్నీ చదువుతూ ఏంచేస్తోంది మీ యువతరం! ఈ నేరాలు, ఘోరాలు అన్నీ మీలోంచి వస్తున్న వేకదా! నా ప్రభావతికి తప్ప ఈ దేశంలో ఇంకెవ్వరికి జరిగిన అన్యాయమూ మీకు చెవికెక్కదా?

ప్రభావతి కవులకందని ఓగొప్ప కథానాయకురాలు. ఆమె ప్రేమ నందుకోవడం నా అదృష్టమేకానీ అర్హతకాదు. ఆమె యిప్పుడులేదు కానీ ఆ మహోన్నత ప్రేమికురాలు నా ఆశయం కోసం తన తనువు చాలించింది. ఆమె ఆశయం హను మాన్ వైద్యం కొనసాగడం. మనిషిగా నేను తప్పు చేశాను. కానీ వైద్యుడిగా నన్ను కొనసాగ నివ్వక పోతే-అది వైద్యశాస్త్రానికే తీరని అన్యాయం చేసినట్లవుతుంది. ఆవిధంగా మానవాళికి అన్యాయం జరుగుతుంది.

నా పేరు ప్రతిష్టలు నా వృత్తి లోని వారికి అసూయను కలి గిస్తాయి. వృత్తిలో నాకు సాటి రాలేక, నా వ్యక్తిగత జీవితాన్ని బైటకు తెచ్చి నన్ను వృత్తిలో దెబ్బతీయాలనుకునే వారికి యువ తరం సహకరించ కూడదు. నేను చేసిన తప్పుకు వ్యక్తిగా నన్ను నిరసించండి. నిరసించే ముందు మీ అర్హతలను మననం చేసు కోండి. వైద్యుడిగా నన్ను నా మానాన బ్రతకనివ్వండి. నా వైద్యాన్ని బహిష్కరిస్తే అందు వల్ల నష్టపోయేది కూడా మీరేనని గుర్తుంచుకోండి!

నన్ను వేలెత్తి చూపే అర్హత మీ అందరికీ లభిస్తే—నన్ను వేలెత్తి చూపించాల్సిన అవసరమూ ఉండదన్న విషయం మీకు అర్థ మయే ఉంటుందని నా ఆశ!" ∗

## ఈ నెల సమస్య

పై రకంగా సాగించాడు పరమశివం తన వాదం. అతనికి కోర్టులో శిక్ష పడిందా—లేదా ముఖ్యం కాదు. అతని వాదన మీకు బ్రహ్మాండంగా నచ్చే పక్షంలో, అతని తరపు 'వకీలు'గా వ్యవహరించి, అతను కేసునుండి బయట పడేందుకు మరికొన్ని 'పాయింట్లు' అందించండి. లేదా ప్రతిపక్షం వకీలుగా నిలిచి, అతణ్ణి, అతగాడి వాదననూ తూర్పారపెట్టి కోర్టులో శిక్ష పడేలా చూడండి!